# శ్రేష్ఠమైనజీవితము (Quality of life)

మనదేశముపై మనము వుంచు విలువ దాని యొక్క పౌరులుగా మనము ఎంత సంతోషమును పొందుచున్నామో లేదా పొందెదమను ఆశ కలిగియున్నామో దానిని బట్టి ఉండును. మనము కొన్ని దేశములపై బహుకొద్ది విలువనిత్తుము. ఎందుచేతననగా అక్కడ వ్యవస్థ క్రింద మనము సంతోషముగా జీవింతుమని మనము భావించము కనుకనే. అదేవిధముగా మానవులచేత దేవునిరాజ్యము యొక్క విలువ లెక్కించబడును. అనేకులు దేవునిరాజ్యముపై ఎటువంటి విలువ ఉంచరు. ఎందుచేతననగా దేవుని రాజ్యము ఇచ్చుచున్న శ్రేష్ఠమైనజీవితము వారియొక్క లక్ష్యము కాదు.

మానవులు తమ ప్రాథమిక, ఉన్నత అవసరతలు తీర్చబడి, సంతృప్తిని పొందినపుడు కలిగే ఆనందము మహిమతో కూడినదైతే అది శ్రేష్ఠమైనజీవితము అవుతుంది. ప్రతి మనిషి కొన్ని అవసరతలు కలిగినవాడుగా జన్మింస్తున్నాడు. మన అవసరతలను బట్టి మనము కదులుచున్నాము. మన అవసరతలు తీరినపుడు మనకు సంతృప్తి, సంతోషము కల్గుతుంది. ఈ అవసరతలు మనం ఏర్పరచుకొనిన అవసరతలు కాదు. దేవుడే మనలో ఏర్పరిచినవి. నిజానికి దేవుడే మన ముఖ్యమైన అవసరము. దేవుడు లేకుండా మనం మన అవసరతలను తీర్చుకొనలేము. దేవుడు మనలో నాటిన సహజకోర్కెలను ఉన్నతస్థాయిలో మహిమ మార్గములో తీర్చుకొనినపుడు కలిగే సంతృప్తిని శ్రేష్ఠమైనదిగా భావించుతాము.

మహిమ అనే మాట ఘనత, గౌరవము, పరువు, ప్రతిష్ఠ, సరియైన వారని ప్రకటించుట అనే భావము కలిగియున్నది. మానవులు ఘనతను కోరుకుంటారు, వదలుకోవడాన్కి ఇష్టపడరు. కారణము అది మన అందరి అవసరత, కాని ఘనత ఎలా కలుగుతుంది? ఎప్పుడు కలుగుతుంది? ఘనతను పొందడాన్కి ఏమిచేయ్యాలి అనే దానిపై వేరువేరు ఉద్దేశాలను మానవులు ఏర్పరచుకొన్నారు. మనము చేసిన పనిని మనకంటే, మనలను సృష్టించినవాడు మెచ్చుకోవాలి అప్పుడే మనకు ఎక్కువ ఘనత కలుగుతుంది.

*"ప్రభువు మెచ్చుకొనువాడు యోగ్యుడు కాని, తననుతాను మెచ్చుకొనువాడు యోగ్యుడు కాడు". (2కొరింధీ 10:18;).*

"మహిమ" అనేది ఉన్నతమైన అవసరము. ముందు మానవులు ప్రాథమికమైన అవసరతలను గురించి ఆలోచించి దానికొరకు మొదట ప్రయాసపడతారు". ప్రాథమిక అవసరతలు శరీరమునకు సంబంధించినవి. ఆహారము, వస్త్రములు, నివాసము, వివాహము మొదలైనవి. ఉన్నత అవసరతలు ఆత్మకు సంబంధించినవి ఏమనగా, దేవుని కుమారుని సారూప్యము సాధించుట, గౌరవించబడుట లేక ఘనపరచబడుట, భద్రత క్షేమము కలిగి స్థిరమైన సహవాసము కలిగి యుండుట.

దేవుని ఎరుగనివారు మొదట ప్రాథమిక అవసరతల కొరకే చింతించుతారు. వాటికే ప్రాధాన్యత ఇచ్చి ప్రయాసపడతారు. ఉన్నతమైన అవసరతలను వెదకే వారికి ప్రాథమిక అవసరతలు దేవుడు తీర్చునని దేవుడు వాగ్ధానము చేసెను. (మత్తయి 6:33;).

*"కాగా దేవుడు తన ఐశ్వర్యము చొప్పున క్రీస్తుయేసు నందు మహిమలో మీ ప్రతి అవసరమును తీర్చును. మన తండ్రియైన దేవునికి యుగయుగములకు మహిమ కలుగును గాక ఆమేన్". (ఫిలిప్పీ 4:19-20;)*

"మహిమలో అవసరతలు తీర్చబడును అనే మాటను గమనించాలి. మన అవసరతలు మహిమ మార్గములోనే దేవుడు తీర్చునని ఇక్కడ గమనించగలము. మనం అవసరతలను గురించి ఆలోచించి, మహిమమార్గము ఆలోచించకపోతే, మన అవసరతలు తప్పుడు విధానములో తీర్చబడునని తలంచి, మనం శ్రేష్ఠమైనజీవితమును కోల్పోతాము. మహిమ వుంటేనే శ్రేష్ఠమైనది అవుతుంది. కావున అలాంటి జీవితము యేసు బోధలపైన మాత్రమే నిర్మించగలమని ఈ పాఠము ద్వారా తెలుసుకొనుచున్నాము.(1 సముయేలు 12 :23)

## మహిమ అనే మాటను గురించి మొదట కొంత ఆలోచించుదము:

1). ఉన్నత స్థానముకై పిలువబడినపుడు మహిమ కలుగును. 2). విజయము సాధించినపుడు మహిమ కలుగును. 3). యోగ్యులుగా అంగీకరించబడినపుడు మహిమ కలుగును.

యేసు శిష్యులు యేసును ఉన్నతస్థానము కావాలెనని అడిగినపుడు. వారు ఏమి అడుగుచున్నారో తెలియక అప్పుడు అడిగారు. ప్రభువు వారికి ఉన్నత స్థానము ఇవ్వడం ఎవరి చేతిలో ఉన్నదో, ఎట్లు లభించునో వారికి తెలిపెను. (మార్కుసువార్త 10:35-45;)

*"యెహోవా, తమమార్గము నేర్పరచుకొనుట నరుల వశములో లేదనియు, మనష్యులు తమ ప్రవర్తనయందు సన్మార్గమున ప్రవర్తించుట వారి వశములో లేదనియు నేనెరుగుదును".(యిర్మీయా 10:23;)*

యేసు ప్రభువు బోధలు మన కోర్కెలను ఉన్నత స్థాయిలో ఎట్లు తీర్చుకొనగలమో నేర్పుతాయి. అందు వలననే యేసు ప్రభువు *"నేనే మార్గమును, సత్యమును, జీవమును నా ద్వారా తప్ప ఎవడును తండ్రి యొద్దకు రాలేదని తెలియపరచెను". (యోహాను 14:6)*

*"మనము సత్యవంతుడైన వానిని ఎరుగవలెనని దేవునికుమారుడు వచ్చి మనకు వివేకమును అనుగ్రహించి యున్నాడని ఎరుగుదుము. మనము దేవుని కుమారుడైన యేసుక్రీస్తు నందున్న వారమై సత్యవంతుని యందున్నాము ఆయనే నిజమైన దేవుడును నిత్యజీవమునై యున్నాడు". (1 యోహాను 5:20)*

www.walkingwithjesus.in